# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 13 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సుప్రీంకోర్టు ప్రాంగణంలో రీల్స్, ఫొటోలు నిషేధం

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

సోషల్ మీడియా రీల్స్, వీడియోలపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు దిగడం, సోషల్ మీడియా రీల్స్, వీడియోలు చేయడాన్ని నిషేధించింది. ఈ మేరకు ఈ ప్రదేశాన్ని హై సెక్యూరిటీ జోన్‌గా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు మీడియా ప్రతినిధులు సైతం ఇంటర్వ్యూలు, లైవ్ కోసం వారికి కేటాయించిన లో సెక్యూరిటీ జోన్? ప్రాంతాన్ని వినియోగించుకోవాలని సూచించింది."హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోసం మొబైల్ ఫోన్ వినియోగించడం నిషేధం. కెమెరాతో పాటు ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ లాంటి వస్తువులు వాడకూడదు. ముఖ్యంగా రీల్స్, వీడియోలు తీయడం నిషిద్ధం. ఒకవేళ ఈ ఆదేశాలను న్యాయవాది, పిటిషనర్లు, క్లర్కులు, బార్ అసోసియేషన్ సభ్యులు ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు ఉంటాయి. ఒకవేళ ఈ నిబంధనలను ఎవరైనా మీడియా ప్రతినిధి అతిక్రమిస్తే సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లోకి నెల పాటు ప్రవేశం ఉండదు." అని స్పష్టం చేసింది.ఈ నిబంధనలను ముఖ్యంగా సుప్రీ కోర్టు సిబ్బంది, రిజిస్ట్రీ అతిక్రమిస్తే తీవ్రమైన అంశంగా పరిగణిస్తామని హెచ్చరిక చేసింది. ఇతర శాఖల సిబ్బంది అతిక్రమిస్తే ఆయా శాఖల నిబంధనల ప్రకారం హెచ్ఓడీలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

- 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల కోసం శాశ్వత మౌలిక వసతులు, ఆలయాల అభివృద్ధిపై ప్రాధాన్యం
- 74 పుష్కర ఘాట్ల నిర్మాణం అవసరం
- గోదావరి 560 కిలోమీటర్ల తీరం వెంట బాసర నుంచి భద్రాచలం వరకు శాశ్వత ఘాట్ల ఏర్పాటుకు ప్రణాళికలు.
- భక్తుల రద్దీకి తగిన సదుపాయాలు
- రెండు లక్షల మంది భక్తులు ఒకేసారి స్నానం చేసినా ఇబ్బంది లేకుండా రోడ్లు, పార్కింగ్, నీరు, వసతి వసతులు.
- ధర్మపురి, కాళేశ్వరం వంటి ప్రధాన ఆలయాల వద్ద ముందస్తు పనులకు ప్రాధాన్యం.
- స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ సహా కేంద్ర పథకాలను వినియోగించి ప్రత్యేక ప్యాకేజీ కోసం ప్రయత్నం
- సీఎం రేవంత్ రెడ్డి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళా స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అదే క్రమంలో పుష్కరాల ఏర్పాట్లు, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు.

గోదావరి పుష్కరాల సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.2027లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీరం వెంట దాదాపు 74 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు.

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు అన్ని ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకని వాటిని మొదట అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆలయాల అభివృద్ధితో పాటు ఆయా ప్రాంతాల్లో శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లతో పాటు భక్తులకు

అవసరమైన వసతి సదుపాయాలన్నీ ఉండేలా ప్లాన్ చేసుకోవాలని చెప్పారు.

మిగితా 4వ పేజీలో

## సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

సీపీ రాధాకృష్ణన్ భారత 15వ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ లతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఎన్డీయే కూటమి నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు.

**మాజీ రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతుల హాజరు**

ఈ వేడుకలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్య నాయుడు కూడా పాల్గొని కొత్త ఉపరాష్ట్రపతికి శు భాకాంక్షలు తెలిపారు.

## ఆదాయ లక్ష్యాలు అందుకోవాలి



**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరగాలి**
**కమర్షియల్ టాక్స్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ యంత్రాంగం యావత్తు కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం కమర్షియల్ టాక్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కమర్షియల్ ట్యాక్స్ శాఖ ప్రగతి పై సమీక్ష నిర్వహిస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. జీఎస్టీరేట్ రేషనలైజేషన్ ద్వారా రాష్ట్రము కోల్పోతున్న ఆదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఓ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

జీఎస్టీ ఎగవేత దారుల పైన కఠినంగా వ్యవహరించాలని, అదేవిధంగా నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని అన్నారు. ఉన్నత స్థాయి అధికారులు నిత్యం ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని పర్యవేక్షణ సాగించాలని ఆదేశించారు.

రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లావాదేవీలు పన్నుల వసూలులో వస్తున్న సమస్యలను అధిగమించడానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి కమర్షియల్ ట్యాక్స్ శాఖలోని ఎన్ఫోర్స్మెంట్, ఆడిట్ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ శాఖలో అంతర్గతంగా కమిటీలు వేసి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ %బూా% రిజ్వీ, కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, డిప్యూటీ కమిషనర్లు సౌజన్య, వాసవి, సంయుక్తారాణి, సునీత, గీత తదితరులు పాల్గొన్నారు.

## నేడు మణిపూర్‌కు ప్రధాని మోదీ

- రూ. 71,850 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన
- తీవ్ర హింస అనంతరం తొలిసారి రాష్ట్ర సందర్శన



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

2024 మేలో మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న తీవ్ర హింస తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి రాష్ట్రాన్ని సందర్శించనున్నారు. రేపు (శనివారం) చురాచాంద్‌పూర్‌లో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మిజోరం, అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్‌లతో పాటు సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు పర్యటన కొనసాగనుందని పీఐబీ ప్రకటించింది.



## ఒక్కరోజే 11,930 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

- గత రెండు రోజులలో 23000 మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి సరఫరా
- మరో 4 రోజుల్లో రాష్ట్రానికి 27,650 మెట్రిక్ టన్నుల యూరియా
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి యూరియా సరఫరా వేగవంతమైందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆర్ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా మరోసారి కేంద్రాన్ని కోరాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

మంత్రిగారు మాట్లాడుతూ, నిన్న ఒక్కరోజే RCF, CIL, KRIBHCO, IPL-DAMRA కంపెనీల నుండి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుందని అన్నారు. గత రెండు రోజులుగా రాష్ట్రానికి 23000 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని అన్నారు. రేపటి వరకు CIL, IPL, RCF, GSFC, SPICకంపెనీల ద్వారా మరో 5,680 మెట్రిక్ టన్నులు రానున్నాయని, అలాగే వచ్చే నాలుగు రోజుల్లో IFFCO, MCFL, CIL-Kakinada, SPIC, KRIBHCO, NFL-Yasa Unsal Sunar-Vizag, CIL-Forza Doria, IPL, Narmada, RCF, RCF-Trombay కంపెనీల ద్వారా 27,650 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానున్నదని వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రానికి వివిధ ఎరువుల కంపెనీల నుండి 11 రేకులు రవాణాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ ఎరువులు మిర్యాలగూడ,కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, తిమ్మాపూర్, వరంగల్, సనత్‌నగర్ రైల్వే రేక్ పాయింట్లకు చేరుకుంటాయని అన్నారు.

మిగితా 4వ పేజీలో

## 15 నుంచి ఇంజినీరింగ్ కాలేజీల నిరవధిక బంద్

- అదే దారిలో వృత్తివిద్యా కళాశాలలు
- 16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీల బంద్
- టోకెన్లు ఇచ్చిన రూ.1200 కోట్లు నెలాఖరులోగా చెల్లించాలి
- ఉన్నతవిద్యా మండలి చైర్మన్‌కు ఎఫ్ఏటీహెచ్ఐ చైర్మన్ రమేష్‌బాబు వినతిపత్రం అందజేత



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.పది వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఏటీహెచ్ఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫీజు బకాయిలతో కాలేజీలను నడపలేమనీ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, అద్దెలు కట్టలేని పరిస్థితి ఉందని ప్రకటించింది. అందుకే ఈ నెల 15 నుంచి ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యా కాలేజీలు నిరవధిక బంద్ చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టా రెడ్డిని ఎఫ్ఏటీహెచ్ఐ చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు, సెక్రెటరీ జనరల్ రవికుమార్, కోశాధికారి కొడాలి కృష్ణా రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె సునీల్‌కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో రమేష్ బాబు, రవికుమార్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను ఈనెలఖరులోగా చెల్లించాలని కోరారు. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఫీజు బకాయిలున్నాయని చెప్పారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులు ప్రయివేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఉన్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికీ జీతాలివ్వలేని పరిస్థితి ఉందన్నారు. దసరా పండుగ వస్తున్నదనీ, అప్పుడు కూడా జీతాలివ్వకపోతే ఎలా?అని ప్రశ్నించారు. జీతాలివ్వకుంటే కాలేజీలకు రాబోమంటూ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది యాజమాన్యాలకు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రయివేటు ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం

మిగితా 4వ పేజీలో

## నేపాల్ నిరసనలో 51 మంది మృతి

బలగం టీవి, ఖాట్మండు

నేపాల్‌లో ఇటీవల జెన్ జడ్ ఉద్యమంలో చోటుచేసుకున్న హింసాకాండలో మృతుల సంఖ్య 51కి చేరింది. ఈ సంఘటనలో కొందరు మంటలలో చిక్కుకుని సజీవ దహనం అయ్యారు. గజియాబాద్ నివాసి 57 సంవత్సరాల మహిళ రాజేష్ గోలా ఖాట్మండూ హ్యాత్ రిజెన్సీ హెూటల్‌లో బస సమయంలో మృతి చెందారు. ఆమె భర్త రాంవీర్ సింగ్ గోలాతో కలిసి నేపాల్ పర్యటనకు వెళ్లారు. ఈ ఘటన ఈ నెల 7వ తేదీన చోటుచేసుకుంది. హెూటల్‌లో ఎక్కువ మంది యాత్రికులు ఉన్నప్పటికీ నిరసనకారులు నిప్పుపెట్టారు. భయంతో బయటపడే ప్రయత్నంలో మహిళ నాల్గో అంతస్తు నుంచి కిందికి దూకగా తీవ్ర గాయపడి మృతి చెందారు. భర్త సురక్షితంగా బయటకు రప్పించబడ్డారు. మృతురాలిపై కుమారుడు విశాల్ గోలా ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు చెలరేగిన దశలో తల్లి-తండ్రి ఒకరికొకరు దూరమయ్యారని, తండ్రితో కలిసి ఉంటే తల్లి సురక్షితంగా ఉండేవారేమో అని చెప్పారు.

ఖాట్మండూ సీనియర్ పోలీసు అధికారి రమేష్ థాపా ప్రకారం, మృతులలో ముగ్గురు పోలీసులే కాకుండా ఇతరులు కూడా నేపాల్ పౌరులుగా ఉన్నారు. భారతీయ మహిళా వ్యక్తి కూడా మృతుల్లో ఉన్నారని ధృవీకరించారు. స్థానిక త్రిభువన్ యూనివర్శిటీ ఆసుపత్రిలో కనీసం 36 భౌతిక కాయాలను భద్రపరిచారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. జెన్ జడ్ ఆధ్వర్యంలో సోమవారం పార్లమెంట్ భవనం వెలుపల జరిగిన నిరసనలు ఉధృత స్థాయిలో సాగాయి. పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు కాల్పులు జరిపిన సందర్భంగా 19 మంది మృతి చెందారని, వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని పోలీసులు తెలిపారు.

## నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కీ

వివరాలు 2వ పేజీలో

## రాష్ట్రంలో రెండు రోజులు అతిభారీ వర్షాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంకు తోడు అల్పపీడన ప్రబావంతో రాష్ట్రంలో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలో శనివారం రాష్ట్రంలో నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## 15న కామారెడ్డి సభ వాయిదా

**టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఈనెల 15న జరగాల్సిన కామారెడ్డి బహిరంగ సభ భారీ వర్ష సూచన కారణంగా వాయిదా వేస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని తర్వాత తెలియజేస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ బహిరంగ సభను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా పార్టీ సీనియన్ నాయకులు సభ నిర్వహణ ఏర్పాట్లు కూడా ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో బహిరంగసభను వాయిదా వేయాలని పార్టీ నిర్ణయం తీసుకుంది.

## రైతుల కష్టాలను చూపిస్తే కేసులు పెట్టడం దుర్మార్గం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యూరియా కొరత సమస్యలను చిత్రీకరిస్తున్న టీ న్యూస్ రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. "రైతుల కష్టాలు చూపిస్తే కేసులు పెట్టడం దుర్మార్గం. ఇది జర్నలిస్టులను వేధించే సమయం కాదు, రైతుల సమస్యలు పరిష్కరించే సమయం" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం, వాటిని బయటపెట్టినందుకు మీడియాపై ఒత్తిడి తేవడం అప్రజాస్వామికమని విమర్శించారు.

ప్రభుత్వం పోలీసులను వాడి మీడియా స్వేచ్ఛను అణిచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. "ఇది ప్రభుత్వ నిరంకుశత్వానికి, ఇందిరమ్మ పోలీస్ రాజ్యానికి నిదర్శనం" అని ఆరోపించారు. సాంబశివరావుపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరిం చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## జర్నలిస్టులపై కేసులు పెట్టడం శోచనీయం

- మాజీ మంత్రి హరీశ్‌రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రైతుల యూరియా కష్టాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం దుర్మార్గమని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన టీ న్యూస్ ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆయన అన్నారు. "గడచిన రెండు నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం, తన నిర్లక్ష్యాన్ని బయటపెడుతున్న జర్నలిస్టులను టార్గెట్ చేయడం శోచనీయం" అని హరీశ్‌రావు విమర్శించారు.

ప్రజల గొంతును నొక్కేందుకు పోలీసులను వాడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. "అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ సర్కార్ మానుకోవాలి" అని అన్నారు. జర్నలిస్ట్ సాంబశివరావుపై పెట్టిన కేసులను ప్రభుత్వం, డీజీపీ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కన్నకూతురిని హత్య చేసిన తల్లి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఓ మహిళ కన్న కూతుర్ని హత్య చేసి ప్రియుడితో పారిపోయిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శబాష్‌పల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట్ల రాజు చిన్న కూతురు మమతను ఐదేండ్ల క్రితం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన బంటు భాస్కర్‌కు ఇచ్చి వివాహం చేశారు. బంటు మమత, భాస్కర్‌కు తనుశ్రీ (3) కూతురు ఉంది. కాగా, తల్లిగారింటి నుంచి వడ్డేపల్లికి వెళ్తున్నానని మే 21వతేదీన కూతురుతో కలిసి వెళ్లిన మమత.. కనిపించకుండా పోయింది. దాంతో తండ్రి రాజు శివ్వంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.మిస్సింగ్ కేసులో భాగంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులకు.. మమత ఫోన్ ఆన్‌లో చూపించడంతో లొకేషన్ ఆధారంగా వారిని మమత, ఫియాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించడంతో తనుశ్రీని హత్యచేసి పాతిపెట్టినట్టు ఒప్పుకున్నారు. శబాష్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్‌ను మమత గతంలో ప్రేమించింది. కాగా, తన కూతురు తనుశ్రీతో కలిసి వడ్డేపల్లికి వెళ్తున్నానని శబాష్‌పల్లి నుంచి వెళ్లిన మమత.. ఫయాజ్‌తో కలిసి ఏపీలోని గుంటూరుకు వెళ్లింది. అక్కడ కొన్ని రోజులు గడిపిన తర్వాత చేతిలో డబ్బులు లేకపోవడం, తనుశ్రీ అనారోగ్యం బారినపడటంతో గుంటూరు నుంచి తిరిగి తూప్రాన్‌కు చేరుకున్నారు. తనుశ్రీ ఎన్నిరోజులున్నా తమకు ఇబ్బందేనని, కూతురిని మట్టుపెడితే అడ్డు ఉండదని భావించిన మమత.. ఫయాజ్‌తో కలిసి కూతుర్ని చంపేసి శబాష్‌పల్లి శివారులోని వాగులో పాతి పెట్టి తిరిగి గుంటూరుకు వెళ్లిపోయారు. మమత చెప్పిన ఆధారంగా ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు పాతి పెట్టిన చిన్నారి మృతదేహాన్ని బయటకు తీశారు. వైద్యుల బృందాన్ని అక్కడికే రప్పించి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకొని పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# సింగరేణిలో అవినీతిని సహించం..

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణిలో జరుగుతున్న అవినీతిని తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. అవినీతిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే, తామే స్వయంగా సీబీఐ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని కవిత స్పష్టం చేశారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కూడా ఆమె ప్రకటించారు.





# టేకాఫ్ సమయంలో ఊడిన విమానం టైర్..

**బలగం టీవీ, ముంబై**

గుజరాత్‌లోని కండ్లా నుంచి ముంబైకి బయలుదేరిన స్పైస్‌జెట్ క్యూ400 విమానంలో ఉద్రిక్తత నెలకొంది. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానానికి అమర్చిన టైర్లలో ఒకటి ఊడి రన్‌వేపై పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు రన్‌వేపై తనిఖీ జరిపి, అది విమాన టైర్ అని నిర్ధారించారు. ఈ సమాచారంతో ముంబై విమానాశ్రయ అధికారులకు అలర్ట్ అందింది. పైలట్లు పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొని, ఎమర్జెన్సీ ప్రకటించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో మొత్తం 75 మంది ప్రయాణికులు ఉన్నారు. కుడి వైపు అమర్చిన రెండు టైర్లలో ఒకటి ఊడిపోయినట్లు సమాచారం. ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉన్నారని స్పైస్‌జెట్ ప్రకటించింది. ప్రమాద సమయంలో ఎలాంటి బయటి సహాయం లేకుండా విమానం టర్మినల్ వరకు చేరింది. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "విమానంలో ఉన్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు" అని సంస్థ స్పష్టంచేసింది.

# కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు షాక్..

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్‌కు సుప్రీం కోర్టులో పెద్ద షాక్ తగిలింది. రైతు ఉద్యమ సమయంలో చేసిన ఓ ట్వీట్‌పై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలంటూ ఆమె వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. "ఇది కేవలం రీట్వీట్ కాదు.. మీరు మసాలా జోడించారు" అంటూ ధర్మాసనం కంగనాపై ఆగ్రహం వ్యక్తం చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మోహతలతో కూడిన బెంచ్ విచారణ చేపట్టి, పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

2020–21లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో రైతులు భారీ నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో వృద్ధ రైతు మహిళ మహీందర్ కౌర్ను కించపరిచేలా ఉన్న ట్వీట్‌ను కంగనా రీట్వీట్ చేయడంతో వివాదం చెలరేగింది. దీంతో మహీందర్ కౌర్ కంగనాపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసును కొట్టివేయమంటూ కంగనా ముందుగా హర్యానా హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఆమె పిటిషన్ తిరస్కరించబడింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించినా, అక్కడ కూడా ఆమెకు నిరాశే మిగిలింది.

# నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కీ

**బలగం టీవీ, హైదరాబాద్**



నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తారాస్థాయికి చేరింది. సోషల్ మీడియా బ్యాన్, అవినీతి ఆరోపణలతో జెన్‌జెడ్ యువత చేపట్టిన ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిణామాల మధ్య ప్రధాని కెపి శర్మ ఓలీ రాజీనామా చేయగా, పార్లమెంట్ రద్దయింది. తాజాగా, మాజీ చీఫ్ జస్టిస్ లిలిసుశీల కర్కీ (72)లిలిను తాత్కాలిక ప్రధానిగా ఉద్యమకారులు ఎన్నుకున్నారు.

సుశీల కర్కీ ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించారు. 2009లో సుప్రీం కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం. 2016లో తాత్కాలిక చీఫ్ జస్టిస్ బాధ్యతలు. అనంతరం రాజ్యాంగ మండలి సిఫార్సుతో పూర్తి స్థాయి చీఫ్ జస్టిస్‌గా నియమితులై, నేపాల్ తొలి మహిళా చీఫ్ జస్టిస్గా రికార్డు. నిస్సహాయంగా పోరాడిన ప్రజా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

# సోషల్ మీడియా పోస్టులపై హైకోర్టు కీలక ఆదేశాలు..

**బలగం టీవీ, హైదరాబాద్**

సోషల్ మీడియాలో రాజకీయ ప్రసంగాలతో కూడిన పోస్టులపై ఆధారం లేకుండా పోలీసులు కేసు నమోదు చేయడానికి వీల్లేదని హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. రాజకీయ ప్రసంగాల ఆధారంగా చేసిన పోస్టులపై కేసులు చెల్లుబాటు కావంటూ బుధవారం హైకోర్టు మార్గదర్శకాలతో కూడిన తీర్పు చెప్పింది. వాటి ఫిర్యాదులపై కేసుల నమోదుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలని స్పష్టం చేసింది. హింస, అశాంతికి అస్కారం ఉండేలా పోస్టులుంటే కేసులను నమోదు చేయవచ్చునని చెప్పింది. తీవ్రమైన రాజకీయ విమర్శలు చేశారని చెప్పి కేసు నమోదుకు వీల్లేదనీ, ఆధారాలు ఉన్నాయని తెలినపుడే కేసు నమోదు చేయాలని స్పష్టం చేసింది. తమ నేత పరువు ప్రతిష్టలకు భంగం చేకూరేలా పోస్టు ఉందని చెప్పి మూడో వ్యక్తి ఫిర్యాదు చేస్తే దాని ఆధారంగా పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేయడం సరిగాదని పేర్కొంది . నిజంగానే ఆ నేత పరువు ప్రతిష్టలకు నష్టం వాటిల్లే పోస్టయితే సదరు నేతే స్వయంగా ఫిర్యాదు చేయాలనీ, మూడో వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చెల్లదని స్పష్టతనిచ్చింది. సీఎంపై విమర్శలు చేశారంటూ రామగుండం, కరీంనగర్‌లోని రెండు పోలీసు స్టేషన్‌లలో నమోదైన మూడు కేసులను కొట్టేయాలం టూ నల్ల బాలు అలియాస్ దుర్గం శశిధర్‌గౌడ్ వేసిన పిటిషన్‌లో జస్టిస్ ఎన్.తుకారాంజీ బుధవారం ఈ కీలక తీర్పు వెల్లడించారు.



ట్వీట్‌లు చట్టబద్ధమైన రాజకీయ వ్యక్తీకరణ పరిధిలోకి వస్తాయని కోర్టు భావిస్తోందని న్యాయ మూర్తి పేర్కొన్నారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు కేసుల నమోదు, విచారణ యాంత్రికంగా, ఏకపక్షంగా జరగకుండా నిరోధించే క్రమంలో ఈ మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. పరువు నష్టం కలిగిందనే ఆరోపణలతో ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారు చట్ట నిబంధనల ప్రకారం 'బాధిత వ్యక్తి' అవునో కాదో పోలీసులు ధ్రువీకరించాలన్నారు. తీవ్ర నేరాల సమయంలో తప్ప పోస్టులతో సంబంధం లేని ఇతరుల తరపున చేసిన ఫిర్యాదులు విచారణార్హం కాదని స్పష్టం చేశారు. తీవ్ర నేరమ యితే ప్రాథమిక విచారణ జరిపి అందులో చట్టపర అంశాలున్నాయో లేదో నిర్ధారించిన తరువాతే కేసు నమోదుకు ముందుకెళ్లాలన్నారు. హింస, ద్వేషం, అశాంతిని ప్రేరేపించే అంశాలకు ప్రాథమిక ఆధారా లుంటే తప్ప వాటికి సంబంధించిన కేసులు నమోదు చేయరాదన్నారు. ఈ విషయంలో కేదార్‌నాథ్‌సింగ్ వర్సెస్ బీహార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు శిరోధార్యమని తేల్చి చెప్పారు. విమర్శనాత్మక, ఘాటైన రాజకీయ ప్రసంగాలపై పోలీసులు యాంత్రికంగా కేసులు నమోదు చేయరాదన్నారు.


ప్రసంగం, పోస్టు హింసను ప్రేరేపించేలా లేదా ప్రజా శాంతి భద్రతలకు తక్షణ ముప్పు కలిగించేలా ఉన్నపుడు మాత్రమే చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేయవచ్చన్నారు. అధికరణ 19(1)(ఎ) కింద సాధారణ రాజకీయ విమర్శలకు రాజ్యాంగ రక్షణలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భావప్రకటన స్వేచ్ఛకూ పరిమితులున్నాయని హితవు పలికారు. పరువు నష్టానికి సంబంధించి పోలీసులు నేరుగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయరాదని తేల్చి చెప్పారు. సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలని ఫిర్యాదుదారుకు చెప్పాలన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 174(2) కింద మేజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశాల మేరకు పోలీసులు చర్య తీసుకోవాలన్నారు. పోస్టులపై ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా యాంత్రికంగా అరెస్టు చేయరాదన్నారు. ప్రతి సందర్భంలోనూ ఆర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు.

రాజకీయ ప్రసంగం/పోస్టు లేదంటే ఇతర సున్నితమైన వ్యక్తీకరణకు సంబంధించి చట్టబద్ధంగా చర్యలుం డేలా చూసుకోవాల్సి ఉందన్నారు. ఇలాంటివాటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పీపీ నుంచి లీగల్ నమోదు చెల్లదని తీర్పు చెప్పారు.

# కేటీఆర్‌కు అరుదైన గౌరవం..

- **న్యూయార్క్‌లో 'గ్రీన్ లీడర్‌షిప్' అవార్డ్..**

**బలగం టీవీ, హైదరాబాద్**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన కృషికి గాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025 కు ఆయన ఎంపికయ్యారు. ఈ నెల చివరిలో అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో జరగనుంది. ఈ విషయాన్ని గ్రీన్ మెంటార్స్ సంస్థ అధికారికంగా కేటీఆర్‌కు తెలియజేసింది. "గ్రీన్ మెంటార్స్ తరపున, గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025 గ్రహీతగా మీ ఎంపికను ధృవీకరించడం మాకు ఒక విశేషం" అని వారు తమ లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కేటీఆర్ తెలంగాణలో అనేక అద్భుతమైన పర్యావరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో 977 పార్కులను అభివృద్ధి చేసి, 10 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాటు, 108 లంగ్ స్పేస్‌లు, థీమ్ పార్కులు, రెయిన్ గార్డెన్స్, ల్యాండ్‌స్కేప్ గార్డెన్స్, వర్టికల్ గార్డెన్‌లను ఏర్పాటు చేశారు. సంస్థాగత తోటలు, కాలనీ, వీధి తోటలు, మీడియన్, అవెన్యూ తోటల పెంపకానికి పెద్ద ఎత్తున కృషి చేసి, తెలంగాణ పచ్చదనాన్ని గణనీయంగా పెంచారు. ఈ కార్యక్రమాలతో హైదరాబాద్ పర్యావరణ పాలనలో ఒక ప్రపంచ ఆదర్శంగా నిలిచింది. ఈ కృషి ఫలితంగా హైదరాబాద్‌కు ప్రతిష్టాత్మకమైన వరల్డ్ గ్రీన్ సిటీస్ అవార్డు లభించింది.

అంతేకాకుండా, ఆర్బర్ డే ఫౌండేషన్ మరియు ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ చేత 'ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్'గా గుర్తింపు పొందిన ఏకైక భారతీయ నగరంగా నిలిచింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో పల్లె, పట్టణ ప్రాంతాలలో మొత్తం పచ్చదనం 24% నుంచి 33% కి పెరిగింది. ఈ విజయాలు తెలంగాణను పర్యావరణ పరిరక్షణలో ముందంజలో ఉంచాయి. ఈ గౌరవంతో, కేటీఆర్ సుస్థిర, నివాసయోగ్యమైన నగరాలను సృష్టించడానికి కృషి చేసిన ప్రపంచ నాయకుల జాబితాలో చేరారు.

# శంకర్‌పల్లి సమీపంలో 40 లక్షల దోపిడీ

- **వ్యాపారి కళ్లలో కారం జల్లి నగదు లాక్కెళ్లిన దుండగులు**
- **పారిపోతుండగా కారు బోల్తా**

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలో దుండగులు ఫిల్మీ స్టైల్లో దోపిడీకి పాల్పడ్డారు. స్టీల్ వ్యాపారి కారులో తీసుకెళ్తున్న రూ.40 లక్షలు

వికారాబాద్‌కు చెందిన ఓ స్టీల్ వ్యాపారి నగదుతో ఫోర్డ్ ఫిగో కారులో హైదరాబాద్ బయలుదేరాడు. ఇదే సమయంలో అతడిని వెంబడించిన దుండగులు స్విఫ్ట్ డిజైర్ కారుతో అడ్డగించారు. ముందున్న కారును ఢీకొట్టి, రాళ్లతో అద్దాలు పగలగొట్టి, వ్యాపారి కళ్లలో కారం జల్లి బొమ్మ తుపాకీతో బెదిరించారు. అనంతరం 40 లక్షలు లాక్కొని పరారయ్యారు.



డబ్బులతో పారిపోతున్న దుండగుల స్విఫ్ట్ కారు శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు వెంటపడుతుండటంతో దుండగులు కారు, సామగ్రి అక్కడే వదిలేసి, నగదుతో పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. కారు, బొమ్మ తుపాకీ, కత్తి, కారం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కారు నంబర్ వివరాలు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు.

# ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోంది

- వేములవాడ పట్టణం బొజ్జపల్లి లో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమి పూజ చేసిన విప్..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణం బొజ్జపల్లిలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో 5 వార్డు మహాలక్ష్మి విధి,నాంపల్లి, బొజ్జపల్లి లో పలు కుల సంఘ, మహిళ సంఘా భవనాల నిర్మాణనికి స్పెషల్ డెవలెప్మెంట్ ఫండ్స్ నుండి మంజూరు కాబడిన ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. బొజ్జపల్లి లో మహిళ సంఘ భవనం, బతుకమ్మ తెప్ప, ముదిరాజ్ సంఘం ప్రహరీ నిర్మాణనికి భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ ముందుకు పోతున్నాం అన్నారు.. ప్రజా ప్రభుత్వంలో ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ ముందుకు పోతున్నామన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. ఆరోగ్య శ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు.

**ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ..**

ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..బొజ్జపల్లి బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.. ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ తెప్ప నిర్మాణం ముఖ్యమైన భాగంగా మారనుందని అన్నారు. బతుకమ్మ పండుగను మరింత ఉత్సాహంగా, విశాలంగా నిర్వహించేందుకు ఈ తెప్ప నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజల, ముఖ్యంగా మహిళల ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకొని ఈ తెప్ప నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ తెప్ప నిర్మాణం బతుకమ్మ పండుగకు మరింత శోభను తీసుకొస్తుందని, ఇది ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని మరింత పటిష్టం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కొనరావుపేట మండల బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ



- కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ
- కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, కోనరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని కొనరావుపేట మండలంలో బిఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ, ఫ్యాక్స్ ఛైర్మన్ బండ నర్సయ్య బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయనతో పాటు వట్టిమల్ల మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ దర్శనాల శంకరయ్య తదితరులు కలసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఫ్యాక్స్ ఛైర్మన్ బండ నర్సయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బీసీ బిడ్డ అయిన ఆది శ్రీనివాస్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. అలాగే, ఆది శ్రీనివాస్ అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, వారి నాయకత్వంలో పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# 'మోదీ కానుక'.. పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పది లక్షల మంది విద్యార్థులకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా దాదాపు ఇరవై వేల సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సైకిళ్లను 'మోదీ గిఫ్ట్ కానుక' పేరుతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు 85 సైకిళ్లను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు పేద కుటుంబాల నుంచి వస్తారని, స్కూల్‌కు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యాలు లేక, బస్సులు, ఆటోలకు డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు స్కూలు సమయం తర్వాత కూడా ప్రత్యేక తరగతులు ఉంటాయని, దీనివల్ల రాత్రి పొద్దు పోయే వరకు స్కూళ్లలోనే ఉండాల్సి వస్తుందని అన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని, విద్యార్థులకు రవాణా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బండి సంజయ్



కుమార్ ప్రధాని మోదీ కానుకగా ఈ సైకిళ్లను పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిరాజి రెడ్డి, ఎస్ఐ గణేష్, మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మాజీ మండల అధ్యక్షులు కస్తూరి కార్తీక్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు గోపి, మహేశ్వరి, బిజెపి సీనియర్ నాయకులు, మీసా శంకర్, వంతడుపుల సుధాకర్, సందేవేని రాజు, పప్పుల శ్రీకాంత్, కోలా కృష్ణ, చిగురు వెంకన్న, రమేష్, మహేందర్, మహిళా నాయకురాలు పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గేదె మృత్యువాత



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని పెద్దగలింగాపూర్ గ్రామానికి చెందిన పయ్యావుల రామకృష్ణ అనే రైతు కు చెందిన గేదె పిడుగు పాటు కు అక్కడిక్కడే మృతి చెందింది. దాదాపు 70 వేల రూపాయల విలువ చేసే గేదె మృతి చెందడంతో రైతు రామక్రిష్ణ లబోదిబోమని బోరున విలపిస్తున్నారు. రైతు ను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గోడిసెల జితేందర్ కోరారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- తంగళ్ళపల్లి పీ.హెచ్.సీ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు రిజిస్టర్, అన్ని వార్డులు, మందుల గదిని పరిశీలించారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.



## కేజీబీవీని సందర్శించిన అధికారులు..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కేజీబీవీ ని టాస్క్ ఫోర్స్ విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి పద్మజ, మండల విద్యాధికారి నెల్లుట్ల శ్రావణ్ కుమార్ సందర్శించి అన్ని వసతులు పరిశీలించారు. బుధవారం రోజున ఏసీబీ కేజీబీవీ లో విజిట్ చేసినా కారణంగా సూచించిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత ఎస్.ఓ విచారించి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యల పైన చర్చించి తగు సూచనలు చేశారు.




## జాగృతి అధ్యక్షురాలు కవితకు చింతమడక వాసుల ఆహ్వానం

**బలగం టీవీ, హైదరాబాద్**

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి బతుకమ్మ పండుగ సందర్భంగా చింతమడక గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 21న జరిగే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలకు హాజరు కావాలని సొంత గ్రామం ప్రజలు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. గ్రామ పెద్దలు మరియు మహిళలు కలిసి కవిత ని కలిసి, తమ ఆత్మీయ ఆహ్వానాన్ని అందించారు. బతుకమ్మ పండుగ తమ గ్రామంలో ఒక ప్రత్యేకమైన ఉత్సవమని, ఆమె రాకతో తమ ఆనందం రెట్టింపవుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కవిత గారు మాట్లాడుతూ, తన సొంత గ్రామం నుండి లభించిన ఈ ఆహ్వానం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, దానిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు.

# పిడుగుపాటుకు 94 గొర్రెలు మృత్యువాత

**బలగం టీవీ, హైదరాబాద్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పెద్దంపేట శివారు గోదావరి వద్ద గురువారం రాత్రి భారీ వర్షానికి ఉరుములు మెరుపులతో పిడుగుపడి 94 గొర్లు మృత్యువాత పడిన ఘటన జరిగింది. వివరాల్లోకెళ్తే.. అంబటిపెల్లి గ్రామానికి చెందిన గొర్రె కాపర్లు మేత కోసం పెద్దంపేట శివారులో గోదావరి వద్ద మేపుకొని గొర్రెల మందను కట్టివేసి జాలి పెట్టి రాత్రివేళ భోజనానికి వెళ్లారు. ఈ క్రమంలో గొర్రెల కాపర్లు కాట్రేవుల కత్తరసాల 21, కాట్రేవుల కళ్యాణ్ 17, కాట్రేవుల ఆది రెడ్డి 20, కాట్రేవుల మల్లేష్ 10, కాట్రేవుల పున్నమి చందర్ 15, కాట్రేవుల శ్రీశైలంకు చెందిన 11 మొత్తం 94 గొర్లు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. తమకు జీవనోపాధైన గొర్రెలు చనిపోవడంతో తాము దిక్కులేని వారమయ్యామని, సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లిందని, తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత గొర్లకాపర్లు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సంఘటనా స్థలానికి జిల్లా వెటర్నరి అధికారి కుమారస్వామి, మండల వెటర్నరీ అధికారి రాజబాబు, మహాదేవపూర్ తహసీల్దార్ రామారావు సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం పంచనామా నిర్వహించి చనిపోయిన గొర్రెలను ఖననం చేసినట్టు తెలిపారు.

# దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని సూచించారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాలను సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అలాగే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు.పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌తో పాటు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు.

దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

# ఒక్కరోజే 11,930 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

ఈ రేకులు ఈరోజు నుండి రేపటి వరకు క్రమంగా జిల్లాలకు చేరుతాయని కూడా తెలిపారు. అదేవిధంగా, 12.09.2025 నుండి 18.09.2025 మధ్యకాలంలో మరో 11 రేకులు రాకకు ప్లాన్ చేయబడ్డాయని వెల్లడించారు. వీటిలోని ఎరువులు మిర్యాలగూడ, Karimnagar, Warangal, Pandillapally, Sanathnagar, Nizamabad రేక్ పాయింట్లకు చేరతాయని తెలిపారు. అక్కడి నుండి అవసరమైన జిల్లాలకు తరలించే ఏర్పాట్లు పూర్తిచేయబడ్డాయని అన్నారు. రైతులకు ఎరువుల పంపిణీ అంతరాయం లేకుండా ఉండేందుకు రైతు వేదికలలో కూడా సేల్ పాయింట్లు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు మంత్రిగారు తెలిపారు. ఎరువులు రాగానే వాటిని వెంటనే రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేశారు.

**ఇక్రిశాట్ అధికారులతో మంత్రి భేటీ....**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్ తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు తెలిపారు. ఈ రోజు సచివాలయం లో ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు బేటీ అయ్యారు. ఈ సందర్భంగా, ఇక్రిశాట్ సంస్థ ప్రతినిధులు చిక్కుళ్ళు, తృణధాన్యాల మెరుగైన రకాలతో పాటు, వివిధ పంటలలో తాము అమలు చేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్ మరియు తెలంగాణ రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం మరింతగా ఎలా అభివృద్ధి చెందుతుందో కూడా వారు చర్చించారు. ఈ చర్చలపై సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు, వ్యవసాయ రంగంలో ఇక్రిశాట్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్ తో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

ఇక్రిశాట్ తెలంగాణతో తన భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కోరుకుంటోందని, తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని తెలిపారు. హైదరాబాద్ లోని ఇక్రిశాట్ సంస్థను సందర్శించాల్సిందిగా ఆ సంస్థ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గారిని ఆహ్వానించింది. డిప్యూటీ డైరెక్టర్ జనరల్–రీసెర్చ్, డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, మరియు డాక్టర్ హరి కిషన్ సుడిలు మర్యాద పూర్వకంగా కలిసి మంత్రికి ఆహ్వానం అందజేశారు. అంతేకాకుండా, వ్యవసాయ పరిశోధనలో ఇక్రిశాట్ యొక్క పాత్రను ఇంకా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఈ రోజు సచివాలయం లో నేధర్లాండ్ బెసేడ్ ఏఐ కంపెనీ ప్రతినిధులతో శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారు కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్న ప్రతి రైతు సమస్యలకు పరిష్కారం చూపించే విదంగా, సంకేతికతను ఉపయోగించి ఒక యాప్ ను వృద్ధిచేయాలనీ అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే వివిధ ప్రైవేట్ సంస్థలు వివిధ రకాల యాప్ ల తో ముందుకు వచ్చాయని, అల కాకుండా వ్యవసాయశాఖనే స్వంతముగా ఒక యాప్ ను వృద్ధి చేసి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాల గురించి, పంటల యాజమాన్యంతో రైతులకు అనునిత్యము ఎదురయ్యే వివిధ సమస్యలకు వెంటనే పరిష్కారం లభించేలా ఒక యాప్ ను ఏఐ రంగములో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వృద్ధి చేయాల్సిందిగా ఆదేశించారు.

# వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం

**బలగం టీవీ, హైదరాబాద్**

కర్ణాటకలో వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుగుతున్న గణేష్ నిమజ్జన ఊరేగింపుపైకి ఓ లారీ దూసుకెళ్లడంతో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు సహా మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం సాయంత్రం హసన్ జిల్లాలోని మొసలె హెూసహళ్లి రైల్వే గేటు సమీపంలో జరిగింది.

# ఆసియా కప్‌లో ఒమన్‌పై పాక్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్తాన్ జట్టు ఒమన్‌పై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే భారత్‌తో కీలక పోరుకు ముందే పాకిస్తాన్ బ్యాటింగ్ బలహీనతలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. ఓపెనర్ సైమ్ ఆయుబ్ మొదటి ఓవర్లోనే డక్ అవ్వగా, మహ్మద్ హారిస్ (43 బంతుల్లో 66బీ 3 సిక్స్‌లు, 7 ఫోర్లు) %–% సాహిబ్జాదా ఫర్హాన్ (29) రెండో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం అందించారు.హారిస్ ఔటైన తరువాత కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా (0), హసన్ నవాజ్ (9) విఫలమవ్వడంతో పాక్ తడబడింది. చివర్లో ఫఖర్ జమాన్ (23), మహ్మద్ నవాజ్ (19) కీలక పరుగులు చేసి స్కోరును రక్షించారు.

ఒమన్ బౌలర్లు అద్భుతంగా రాణించారు. ఆమిర్ కలీమ్ (4–0–31–3), షా ఫైసల్ (4–0–34–3)లు పాక్ టాప్ ఆర్డర్‌ను చిత్తు చేశారు. ఫలితంగా పాకిస్తాన్ భారీ స్కోరు చేయలేకపోయింది.

160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు 67 పరుగులకే ఆలౌట్ అయింది. పాక్ బౌలర్ల ముందు ఒక్క బ్యాటర్ కూడా నిలబడలేకపోయాడు. ఫలితంగా పాక్ 93 పరుగుల తేడాతో గెలుపొందింది.

## 15 నుంచి

# ఇంజినీరింగ్ కాలేజీల నిరవధిక బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొన్ని కాలేజీలు అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నాయని వివ రించారు. ఇంకోవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నామన్నారు. అందుకే మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 15 నుంచి రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, ఆర్కిటెక్చర్, ఎంబీఏ, ఎంసీఏ, లా, బీఈడీ, పారామెడికల్ కాలేజీలు నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో పది లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏటీహెచ్ఐ ప్రతినిధులు అల్జాపూర్ శ్రీనివాస్, తుమ్మ జైపాల్‌రెడ్డి, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి, రేపాక ప్రదీప్‌రెడ్డి, గుర్రం

నాగయ్య, కె రామదాస్, ముద్దసాని రమేష్‌రెడ్డి, పుల్లా రమేష్‌బాబు, గోపగాని వెంకట నారాయణ, శ్రీనివాస్ ఆచార్య తాడూరి, సరస్వతీ రమేష్, కోదాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక, అద్దెలు కట్టలేక ఈనెల 16 నుంచి రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించామని టీపీడీఎంఏ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి చెప్పారు. ఫీజు బకాయిలను ఈ ఏడాది మే 20లోపు విడుదల చేయిస్తామంటూ ఉన్నత విద్యామండలి చైర్మెన్ హామీ ఇవ్వడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో తాము డిగ్రీ విద్యార్థుల పరీక్షలను నిర్వహించామని గుర్తు చేశారు. డిగ్రీ, పీజీ కాలేజీలకు రూ.2,500 కోట్ల వరకు ఫీజు బకాయిలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రయివేటు కాలేజీలను ప్రభుత్వం తీసుకుని నడపాలని కోరారు. తాము కాలేజీలను నడపలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పారు. టీపీడీఎంఏ ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యావైద్య రంగాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. 20 నెలలైనా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.



# సియాటెల్‌లో పవన్ ఫ్యాన్స్ లడ్డూ వేలంపాట

**బలగం టీవీ, హైదరాబాద్**

ఖండాంతరాల్లో ఉన్న పవన్ కళ్యాణ్ అభిమానులు తమ భక్తి, అభిమానాన్ని చాటుకున్నారు. అమెరికాలోని సియాటెల్‌లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణపయ్య లడ్డూ వేలంపాటలో పాల్గొని, రూ.3 లక్షలకు సొంతం చేసుకున్నారు.

పాపులర్ ప్రొడ్యూసర్ టీజీ విశ్వ ప్రసాద్ ఆధ్వర్యంలో 11 రోజులపాటు నిర్వహించిన వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ప్రతిరోజూ సాయంత్రం 500 మందికిపైగా భక్తులకు మహాప్రసాదం పంచినట్టు నిర్వాహకులు తెలిపారు. వేలంపాటలో పాల్గొన్న అభిమానులు పవర్ స్టార్ నటిస్తున్న “ఓజీ” సినిమా ఘన విజయవంతం కావాలని గణనాథుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా యువ నటుడు అశోక్ గల్లా కూడా అభిమానుల భక్తిని అభినందించారు. వేలంపాటలో వచ్చిన రూ.3 లక్షలను సియాటెల్ క్యాన్సర్ ఆసుపత్రికి విరాళంగా అందజేస్తామని నాసా సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. అనంతరం లడ్డూను భక్తులకు పంచారు. జనార్ధన్ చక్కా, అశోక్ పసుపులేటి, లక్ష్మీనారాయణ, నవీన్ గంధం, సతీశ్ బత్తిన, వినోద్ పర్ణ, సుహాగ్ గండికోట, నితీశ్, నరేంద్రతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోషల్ మీడియాకు విరామం ప్రకటించిన అనుష్క శెట్టి

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి తన అభిమానులకు అనూహ్యమైన షాక్ ఇచ్చారు. కొంతకాలం పాటు సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ మేరకు చేతిరాత నోట్‌ను తన ఖాతాలో పోస్ట్ చేయగా, అది ప్రస్తుతం వైరల్‌గా మారింది.

“బ్లూ లైట్ నుంచి క్యాండిల్ లైట్‌కి మారుతున్నా. స్క్రోలింగ్‌కు అతీతంగా ఉన్న ప్రపంచంతో మళ్లీ కనెక్ట్ కావడానికి ఈ విరామం తీసుకుంటున్నా. మరిన్ని కథలతో, మరింత ప్రేమతో త్వరలోనే కలుస్తాను. ఎప్పుడూ నవ్వుతూ ఉండండి” అని ఆమె తన నోట్‌లో పేర్కొన్నారు.

ఇటీవలే అనుష్క నటించిన ‘ఘాటి’ (దర్శకుడు: క్రిష్, హీరో: విక్రమ్ ప్రభు) సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి మిశ్రమ స్పందన లభించినప్పటికీ, అనుష్క నటనకు విమర్శకులు విశేషంగా ప్రశంసలు కురిపించారు. సినిమా ప్రమోషన్లలో చురుకుగా పాల్గొన్న ఆమె, విడుదలైన కొద్ది రోజుల్లోనే సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించడం గమనార్హం.ప్రమోషన్ల సమయంలో అనుష్క తన మనసులోని మాటను బయటపెట్టారు. ఇండస్ట్రీలో 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, “పూర్తిస్థాయి నెగెటివ్ పాత్ర చేయాలని ఉంది. బలమైన కథ వస్తే తప్పకుండా విలన్‌గా నటిస్తాను” అని వెల్లడించారు.

ప్రస్తుతం తాను కొత్త కథలు వింటున్నానని, మంచి ప్రాజెక్టులు వరుసలో ఉన్నాయని అనుష్క తెలిపారు. తన తొలి మలయాళ సినిమాతో పాటు, త్వరలోనే ఓ ఆసక్తికరమైన తెలుగు సినిమా ప్రకటన కూడా ఉంటుందని చెప్పుకొచ్చారు. ‘వేదం’ తర్వాత క్రిష్‌తో కలిసి ఆమె పనిచేసిన సినిమా కావడంతో ‘ఘాటి’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు అనుష్క తదుపరి ప్రాజెక్టులపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.